# చావనీ....

పెరటి గుమ్మానికానుకుని కూర్చుంది పద్మావతి. ఒళ్ళో చేటడు బియ్యం. కనుచీకటి పడుతోంటే బియ్యం ఏరలేక నిటారుగా కూర్చుంది. నడుం నొప్పిగా వుంటే ఒళ్ళు విరుచుకుంది. కళ్ళు మండుతూంటే గుమ్మానికి తలాన్చి ఓ క్షణం కళ్ళు మూసుకుంది.

మరో క్షణం పోయేక కళ్ళు తెరిచింది. ఎదురుగా తులసి కోట. ఆ గూడులో కొడిగట్టిన దీపం. ప్రమిదలో చమురు వెయ్యాలి. వత్తి ఎగదొయ్యాలి. అంటించాలి. అప్పుడు మళ్ళీ కళకళలాడుతుంది తులసికోట. ఆ వెలుగు వింతగా పరుచుకుంటే పెరడు పెరడంతా శోభాయమానంగా వుంటుంది.

అసుర సంధ్యలో దీపంపెట్టాలి.

దీపం లేకపోవడంతో పెరట్లో ఈశాన్యంగా అరటిచెట్ల చీకటినీడలో గిలకబావి, పిలక రాక్షసుడి తెరుచుకున్న నోరులా కన్పిస్తోంది. బావి చుట్టూ పరుచుకున్న బురద, ఆ రాక్షసుడు తినగా పారేస్తే నల్లగా మారిన రక్తమాంసాల ముద్దలా కంపు కొడుతూ కన్పిస్తోంది.

భయంగా చూపు తిప్పేసుకొంది పద్మావతి.

లేని ఓపిక తెచ్చుకొని ప్రమిదలో చమురుపోసి వత్తి ఎగదోసి వెలిగించింది.

రెపరెపలాడుతుంటే రెండు అరచేతులూ అడ్డుపెట్టి దీక్షగా దీపంవేపే చూస్తోంది. కిందనున్న దీపం వెలుతురు ఆమె ముఖం మీద కిందనుండి పైకి పరచుకోవడంతో అదాటుగా చూస్తే పద్మావతి ముఖం దెయ్యం ముఖంలా కన్పిస్తోంది.

గాలి కొంచెం నిమ్మళించగానే నెమ్మదిగా దిపాన్ని గూట్లో పెట్టింది. గూట్లోంచి సూటిగా వెలుతురు ఆమె ముఖం మీద పడుతోంటే ముఖం కాంతివంతంగా, దేవతలా కన్పిస్తోం దిప్పుడు.

మళ్ళీ వచ్చి గుమ్మం దగ్గర కూర్చుంది పద్మావతి.

ఆ దీపాన్ని చూస్తూ నిట్టూర్చింది. అంత దూరంలో వున్న దీపంకూడా ఆ నిట్టూర్పువేగానికీ, వేడికీ రెపరెపలాడిందా అన్నట్టు అనిపించింది.

"మా పద్మావతి మనసు వెన్నెల. రూపం కూడా చిదిమి దీపం పెట్టొచ్చు. ఆ రూపం, ఆ మనసూ ఎదుటివాళ్ళ కళ్ళకూ బ్రతుకులకూ వెలుగునిస్తుంది...." అని పదే పదే చెప్పుకునే వారు ఆమె తల్లిదండ్రులు. అత ఆపురూపంగా చూసుకున్న తల్లి

దంప్రడులుకూడా ఆడపిల్లనికన్న నేరానికి ఆశల్నీ, బ్రతుకుల్నీ అల్లుడి చేతిలో పెట్టి జీవితంలో చీకటి నింపుకున్నారు.

భర్త మురళితో అత్తవారింట్లో అడుగు పెట్టిన పద్మావతిని అమితంగా ఆకర్షించిందా తులసికోట. తనకి తనే ఆ తులసి మొక్కగా కనిపించింది. దానికి రక్షణగా కోటలా నిలిచిన ఆ కోట తన తల్లిదండ్రుల ప్రేమలా అనిపించింది. ఎందుకో దాన్ని చూడగానే ఒక్కసారిగా కళ్ళు చెమర్చాయి పద్మావతికి.

"మహాతల్లీ—ఆ తులసి కోటని చూస్తూ కూర్చుంటే ఇంటి పనులెలాగవుతాయే...." అంటూ అత్తగారి కేక ఖంగుమంది.

కంగారుగా చేటలో బియ్యం అందుకొంది. తపేళాలో పోసి కడగడానికి నూతి దగ్గరికి వెళ్ళింది. రాక్షసుడి ఆవలించిన నోటిలా నుయ్యి చీకటిగా కన్పించగానే భయంతో గజ గజ వణుకు పుట్టింది పద్మావతికి.

ఆ భయంలో అప్పుడు జ్ఞాపకాని కొచ్చిందామెకు.

"అవును. అత్తగారి కేక భ్రమ. అసలు అత్తగారుంటే కదా. అత్తగారి చావుకి తనే కారణమా....?

"అవును నువ్వేనువ్వే కారణం....నువ్వీ ఇంట అడుగు పెట్టకపోతే అత్తగారింత వేగంగా పరలోకం ప్రయాణం కట్టేదా? అందరు ఆడపిల్లల్లా కోరిన కట్నం నువ్వూ ఇచ్చి వుంటే

నిన్నావిడ ఆరళ్ళుపెట్టేదా? అత్తగారంటే ఏదో పెద్దావిడ.... ఆవిడ ఏదో అంటే నువ్వు తిరగబడాలా? అందుకే నువ్వే నువ్వే ఆమె చావుకి కారణం....' అంటూ పద్మావతి చెవిలో హోరు హోరుమంటూ వెయ్యిగొంతుల ఘోష.

"లేదు. లేదు" అంటూ గట్టిగా పిచ్చిగా అరిచింది పద్మావతి. కాని ఆ అరుపు గొంతు దాటి బయటికే రాలేదు. ఆ కేక పద్మావతికే విన్పించలేదు.

ఒక్కసారిగా ఒళ్ళంతా నిస్సత్తువ ఆవహించింది. పరుగు పరుగున పెరటి గుమ్మం దగ్గరకు వెళ్ళి మళ్ళీ అక్కడే కూల బడింది. ఆందోళనతో ఒక్కక్షణం కళ్ళు మూసుకుని తెరిచింది. చూపులలాగే ఆ గిలక బావి చప్టామీదే నిలిపింది. ఆ గాజు గోళాల కాంతిలేని కళ్ళకు ఆ రోజు జరిగిన సంఘటన........

"పెళ్ళయ్యి సంవత్సరమయింది. ఇంతవరకు ఓ ముద్దూ లేదు ముచ్చటా లేదు. ఇదిగో కవరు తెచ్చి ఇక్కడ పెడు తున్నాను. మీ నాన్నకి ఉత్తరం రాయి. ఏడో తరగతి పండితు రాలిని నిన్ను రాయమంటే ఒకదానికొకటి రాస్తావు.కాగితంమీద రాసి ఇక్కడ పెడుతున్నాను.కూడబలుక్కుని చూసిరాయి.ఇదిగో చూడూ—కేంపుకి వెళ్తున్నాను. రేపు సాయంత్రానికిగాని రాను. ఈ లోపుగా రాసి పక్కింటి పంకజం గారబ్బాయి చేత పోస్టు చేయించు. నా మొగుడు మా నాన్నని పీల్చిపిప్పి చేస్తున్నాడు

మోౖరోమంటూ ఏడ్చుకుంటూ కూర్చోకు, తెలిసిందా. నీ సంగతి కనిపెట్టి చూస్తూండమని మా అమ్మకి చెప్పే వెడతాన్లే....ఆవిడే నీకు మందు" అంటూ చీదరించుకొనిచెప్పి మరీవెళ్ళేడు మురళి.

మురళి అలా చెప్తున్నప్పుడే కళ్ళలోంచి ఉబికుబికి కన్నీళ్ళు వచ్చేయి. ఇంకా ఏమేం కావాలని ఆ ఉత్తరంలో రాయమన్నాడో? అలా రాయకపోతే ఒకరికిద్దరు కలిసి చెరో చెంపా వాయించేస్తారు. అందులోనూ అత్తగారికి అప్పచెప్పేరు.

అలా ఎంతసేపు కూర్చుండిపోయిందో, పంకజం వచ్చి పలకరించేవరకూ తెలియనేలేదు. "ఏమిటీ పద్మా....శ్రీవారు ఊరెళ్ళేరా....ధ్యాసలోలేవూ...." అంటూ వేళాకోళం చేస్తోంది.

"అంతపాటి అదృష్టం కూడానా...." అంది అనాలోచితంగా.

పంకజానికి మురళీ గురించీ, అత్తగారి సంగతీ కొంత మట్టుకు తెలుసు. అందుకే వెంటనే పోల్చేసింది.

"ఇప్పుడేమయ్యింది?" అని వెంటనే అడిగింది.

మురళి రాసిచ్చిన ఉత్తరం చూపెట్టి విషయం చెప్పింది.

పూర్వకాలంనాటి పతివ్రతల కథలు వల్లించకుండా నేను చెప్పినట్లు చేస్తావా....మంచి ఆధారం దొరికింది. ఈ ఉత్తరంతోపాటు మురళిమీదా, అత్తగారిమీదా కలిపి రిపోర్టుచెయ్.." అన్నది పంకజం.

నవ్వొచ్చింది పద్మావతికి. ఆ నవ్వుకూడా సంతోషంగా రాలేదు. విరక్తి, నిస్సహాయతా కలగలసిన నవ్వు. కన్నీళ్ళూ ఉప్పుసీళ్ళూ కలిసి కక్కుకున్నట్టుగా వుంది.

"పిచ్చిదానిలా ఏవిటా నవ్వు! నవ్వడంకన్నా నువ్వేమీ చెయ్యలేవనే నిన్ను వేపుకుతింటున్నారు" అంది పంకజం.

"ఊఁ....అయితే ఇంతకీ ఏం చేద్దామని నీ ఉద్దేశం?" అనడిగిందామె.

"కొందరి బ్రతుకులింతే పంకజం....ఆయన చెప్పిన ప్రకారం చెయ్యడమే. చేస్తే మా నాన్న ప్రాణం కడబడుతుంది. లేకపోతే నా ప్రాణం పోతుంది...."

"సరే, నీ ఖర్మ....కాని ప్రాణంమీదికొచ్చేవరకూ తెచ్చుకోకు. నాకే మాత్రం చెప్పినా నా చేతనైన సాయం చేస్తాను...." అంది పంకజం.

"ఏం తల్లీ, ఇంట్లో పనులన్నీ అయిపోయేయా....?" అంటూ వచ్చింది అత్తగారు. ఆ మాటల్లో వెటకారం, ఆ గొంతులో దయచేయమన్న అర్థాలు స్పష్టంగా వినిపిస్తున్నాయి. అంచేతనే "లేదు పిన్నిగారూ....వంటచెయ్యాలింకా.... వస్తాను...." అంటూ లేచింది పంకజం.

"మంచిది తల్లీ...." అంటూ ఆమెను వెళ్ళనిచ్చి, "ఏం మహాతల్లీ.... నీ పనులింకా ఎక్కడివక్కడే వున్నాయి. తీరిగ్గా

కుచ్చుటప్పాలు మాటడకపోతే వాడేదో ఉత్తరం రాయమన్నాడు రాయగూడదూ....'' అంటూ మొదలెట్టింది.

"ఇదిగోనండి.... పనులయ్యేక రాసేస్తాను...." అంటూ పెరట్లోకి వెళ్ళింది పద్మావతి.

అంట్లు తోముతూంటే చిన్నతనంలో తను పెరిగిన వాతావరణం కళ్ళముందు కదలాడింది.బియ్యం చేస్తూంటే ఇద్దరక్కల పెళ్ళిళ్ళు చేసి మాసిపోయిన తండ్రి మసకమసగ్గా కనిపించేడు. బట్టలుతుకుతూంటే తనకు సంబంధాలు చూసి చూసి ఉస్సురంటూ నిట్టూర్పులువిడవడం చెవులకు విన్పించింది. వంటింట్లో కూరలు తరుగుతూంటే తనగురించి భర్తనూ, అత్తగారినీ కాళ్ళావెళ్ళా పడే తండ్రి గుర్తుకొచ్చి కడుపు తరుక్కుపోయింది.

పనులయ్యేసరికి కనుచీకటి పడుతోంది.

పెరటి గుమ్మందగ్గర ఒక్కక్షణం విశ్రాంతిగా కూర్చోబోయింది పద్మావతి. "ఏం మహాతల్లీ.... మళ్ళీ మళ్ళీ జ్ఞాపకం చెయ్యాలా, మీ ఆయనేం చెప్పేడు... ఉత్తరం రాయమన్నా...." అంటూ గర్జించింది అత్తగారు.

"అది కాదండీ.... మా నాన్న ఇప్పటికే చాలా అప్పుల్లో ఉన్నాడు. ఇప్పుడీ ఉత్తరం రాస్తే డబ్బు ఇవ్వనూలేక మాననూలేక మానసానికి పడిచస్తాడు." అంటూ నెమ్మదిగా బ్రతిమాలుకునే ధోరణిలోనే చెప్పింది.

"ఛస్తే చావనీ.... అనాడు చిన్నల్లుడిని చూస్తానని మాట ఇచ్చేడుగా.... ఏం చూసేడూ అని..." అంది అరుస్తూ అత్తగారు.

"నెమ్మది అత్తగారూ... పక్కింటి పంకజం విన్నదంటే రాద్ధాంతం చేస్తుంది." అంది పద్మావతి భయంగా పక్కింటివైపు చూస్తూ.

"అంటే నేనరుస్తున్నానటే' తీవ్రంగా బిగ్గరగా అంది.

పద్మావతి మరేం మాట్లాడలేదు. మాటాడుతున్నకొద్దీ అత్తగారు రెచ్చిపోతుంది....ఆ ఇంటి కోడలిగా తన కాపురం కోసం తెగేదాకా లాగడం మంచిదికాదు. నెమ్మదిగా లేచి తులసి కోట దగ్గరకు వెళ్ళి కూర్చుంది. కన్నతల్లి ఒళ్ళో కూర్చున్నట్టుంది.

"ఏవిటే ఆ నిర్లక్ష్యం. ఉత్తరం రాయమని మొగుడు చెప్పేడు. నేనిప్పటికి వందసార్లు నొక్కి చెప్పేను. వినపడ్డం లేదా, మహారాణిలా కూర్చున్నావు....లే...."అంది.దగ్గరగా వచ్చి నిలబడింది.

"కాస్త ఆలోచించండి....మా నాన్న పరిస్థితి కాస్త చక్కబడగానే రాస్తానండి....ఆయన పరిస్థితి బాగా లేనపుడు రాసి ప్రయోజనమేం వుంది....మీరే ఆయనతో చెప్పి ఇప్పటికి ఊరుకొమ్మని చెప్పండి.... ఈ ఉపకారం చేస్తే నా చర్మంతో చెప్పులుకుట్టి పూజిస్తానండి...."

"నువ్వు ముందులే...." అంటూ జుత్తు పట్టుకొంది అత్తగారు.

"నా మాట వినండత్తగారూ ...'' అంటూ ఏదో చెప్ప బోయింది.

గొరగొర ఇంట్లోకి ఈడ్చుక పోబోయింది లేడిపిల్లని తన గుహలోకి ఈడ్చుకుపోయే పులిలా. పట్టుకాస్త జారగానే పరుగు పరుగున పెరట్లోకి తిరిగి వచ్చింది పద్మావతి. దాంతో మరింత పట్టుదల పెరిగిందత్తగారికి.

బ్రతిమాలుకుంటూ చిన్నగా ఏడుస్తూ "వద్దు వద్దు" అని దణ్ణం పెట్టుకుంటూ నూతి వైపుగా వెనక్కి వెనక్కి జరుగుతూ రాసాగింది పద్మావతి.

"రావే ముందు...." అంటూ పట్టుకుంది.

నూతిచప్టా దగ్గర పద్మావతికీ, అత్తగారికీ పెనుగులాట మొదలయ్యింది. ఎలాగైనా వయసు మళ్ళిందికావడాన అత్తగారి కాలుజారి పొట్టిగా వున్న నూతిగట్టుమీంచి ఆమె నూతిలో దబ్బున పడింది.

....జరిగిన సంఘటన గుర్తు రాగానే గాజు గోళాలలాంటి కళ్ళల్లో నీళ్ళు.. వంటిమీదా నుదుటిమీదా నీటి బిందువులూ.... గుండెల్లో విపరీతమైన దడదడ శబ్దం....ఆపాదమస్తకమూ గజగజా వణుకూ....ఇప్పుడే జరిగినట్టనిపిస్తోంది పద్మావతికి.

చుట్టూ చూసింది.

నూతి దగ్గర బియ్యంతో తపేలా మిలమిల మెరుస్తోంది. తనకున్న ఒకేఒక ఆశలా. గబాలున వెళ్ళి అందుకుంది. భర్త వచ్చే వేళయింది. అందుకే పొయ్యిమీద పెట్టింది.

ఇంట్లో అన్ని గదుల్లోనూ దీపాలు వేసింది. ఇల్లే కాదు ఆమె మనసూ వెలుతురుతో నిండి వుంది. ఆ వెలుగు పంకజమే.

ఆనాడు పంకజం వచ్చి నలుగుర్ని కేకేసి అత్తగారిని పైకి తీయించినప్పటికే చెయ్యి దాటిపోయింది. కాలుజారి పడిపోయినట్టు ఇరుగూపొరుగూకి చెప్పింది. కబురంది వచ్చిన మురళికి కర్మకాండలు కానిచ్చేక గడ్డి పెట్టింది పంకజమే. "ఆడకూతురి కన్నీటి మడుగులో మీ అమ్మ పోయింది. చస్తే చావనీ....నిన్ను పట్టుకున్న డబ్బు పిశాచాన్ని ఇంతటితో చావని ...కళ్ళు తెరు" అంటూ గట్టిగా, తీక్షణ్ణంగా అనేక విధాల చెప్పింది పంకజమే.

మురళి కళ్ళు తెరిచేడో లేదో తెలియదు. కాని నాటినుండీ భయం భయంభయంగానే వుంటున్నాడు. ఆరళ్ళూ లేవు, అనురాగాలూ లేవు. ఉన్నదంతా భార్యాభర్తలబంధం మాత్రమే.

ఏ నాటికైనా తనమీద ప్రేమాభిమానాలు పెంచుకోడా అనే ఆశ ఒక్కటే మిగిలింది పద్మావతిలో.

భర్త ఇంకా రాలేదు. కరెంటు పోయింది. ఊరంతా చీకటి సముద్రంలో మునిగిపోయింది. అయినా తల్లిలాంటి తులసికోటనుండి వెలుతురు పరుచుకుంటోంది ఇల్లంతా. 'సంకజం తన నట్టింట దీపం పెట్టింది.' తులసి కోటను చూస్తూ భక్తితో చేతులు జోడించింది పద్మావతి. ★